సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 9 । అక్టోబర్ । 2024

I



విజయనగర ఖ్యాతి ఇనుమడించేలా ఉత్సవాలు -IIలో

జిల్లా ఖ్యాతి ఇనుమడించేలా విజయనగర ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్ అన్నారు.



నల్లమందు పట్టివేత -IIలో

రామభద్రపురం మండలంలోని ముచ్చర్లవలస పరిధిలో గల పెట్రోల్ బంకు సమీపంలో ఎస్సై వి. ప్రసాదరావు సిబ్బందితో కలిసి నల్లమందును పట్టుకున్నారు.



డీలర్లను రేషనలైజేషన్ చేయాలి

రేషన్ డిపోల బై ఫర్‌కేషన్‌లో డీలర్లకు అన్యాయం జరగకుండా రేషనలైజేషన్ చేయాలని డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. -IIలో

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీలకు 'మోడల్' విద్యార్థి



విద్యార్థిని రీబికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని ఎ.రీబిక జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ మంగళవారం తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–19 మహిళా కబడ్డీ పోటీలలో ఆమె గెలుపొంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయస్థాయి కబడీ పోటీలకు ఎంపికైన జట్టుతో పాటు మోడల్ స్కూల్ విద్యార్థిని రీబికను ఎంపైర్లు, మోడల్ స్కూల్ పీడీ శివరాంప్రసాద్, ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్‌లు అభినందించారు.

ముగిసిన ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

- 16 డిమాండ్ల సాధన ప్రతిపాదనలకు ఆమోదం

విజయనగరం అర్బన్: విజయనగరంలో మూడు రోజులుగా జరిగిన ఏపీటీఎఫ్ 80 వసంతాల మహాసభ మంగళవారంతో ముగిసింది. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలతో కూడిన 16 డిమాండ్ల సాధన ప్రతిపాదనలను మహాసభ ఆమోదించింది. అధ్యక్షుడు జి.హృదయరాజు అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి విధాన పత్రాన్ని సభలో ప్రకటించి తీర్మానాలను ఆమోదింప చేశారు. తీర్మానాల్లో ప్రధానంగా ఏకీకృతరూల్స్ సమస్య పరిష్కరించాలని, సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని, ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం, ప్రజల స్థానిక మాతృభాషలో విద్యా విధానం కొనసాగించాలని, జీఓ నంబర్ 170, 84, 85 జీఓలను రద్దు చేయాలని, తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సోషల్ పాఠ్యపుస్తకాలలో సిలబస్‌ను తగ్గించాలని పేర్కొన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం, ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉన్న సౌకర్యాలు కల్పించాలని, కేజీబీవీలకు శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని, స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్ల ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలనే డిమాండ్లతో మహాసభ తీర్మానించింది. ఈ తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పిస్తామని రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, చీఫ్ ఫ్యాక్టర్ కె.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయ ప్రకృతి పత్రిక సంపాదకుడు జి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు వై.సత్యం, డి.ఈశ్వరరావు, రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు, 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన, రాష్ట్ర కౌన్సిలర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లె పండగకు వేళాయె..!



ఉపముఖ్యమంత్రి సమీక్షలో జిల్లా నుంచి పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- గ్రామసభల్లో తీర్మానించిన అంశాల అమలుకు శ్రీకారం
- 14 నుంచి జిల్లాలో రూ.60 కోట్లతో 313 పనులు

సాక్షి, పార్వతీపురం మన్యం: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 'పల్లె పండగ' కార్యక్రమానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు ఈ కార్యక్రమం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. గత ఆగస్టు 23న జరిగిన గ్రామసభల్లో తీర్మానించిన అన్ని పనులకూ శంకుస్థాపనలు చేసి, పనులు పూర్తి చేసే లక్ష్యంగా ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఉపాధిహామీలో భాగంగా సీసీ, బీటీ రహదారులు, గోకులాలు, ఉద్యాన పంటలు, ఫారంపాండ్లకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. గ్రామాల్లో చేపడుతున్న, పూర్తి చేసిన పనుల వివరాలు గ్రామస్తులకు తెలిసేలా డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కార్యక్రమం నిర్వహణపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

రూ.60 కోట్లతో వివిధ పనులు

ఆగస్టు 23న జిల్లాలోని 15 మండలాల పరిధి 451 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ప్రధానంగా 27 అంశాలపై చర్చించారు. ఉపాధిహామీ పథకంలో చేయాల్సిన పనులకు ప్రాధాన్యమిచ్చారు. అత్యధికంగా రహదారులపైనే చర్చకు వచ్చింది. మొత్తం పనుల వివరాలను పరిశీలించిన అనంతరం.. నిధుల కోసం కలెక్టర్ నివేదిక సమర్పించారు. ఇందులో భాగంగా మొత్తం జిల్లాలో రూ.60 కోట్ల వ్యయంతో 313 పనులను పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. పనులకు సంబంధించి ఈ నెల 14న భూమి పూజ చేయనున్నారు. జిల్లాలో చేపట్టబోయే పనుల్లో 95 శాతం పనులకు పరిపాలన ఆమోదం లభించింది. మిగిలిన పనులకు కూడా బుధవారం లోగా అనుమతులు వస్తాయని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మొత్తం నిధుల్లో బీటీ రహదారులు, గోకులాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. బీటీ రహదారుల కోసం రూ.51 కోట్లు వెచ్చించనున్నారు.

ప్రథమ పౌరులకు అవమానం



ఇటీవల కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి సమస్యలు వివరిస్తున్న పలు పంచాయతీల సర్పంచ్‌లు

వారంతా ప్రజలతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు. పంచాయతీలకు ప్రథమ పౌరులు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన పంచాయతీ సర్పంచ్‌లకు నేడు కూటమి ప్రభుత్వంలో అవమానాలు ఎదురవుతున్నాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ప్రస్తుతం కూటమి శాసనసభ్యులే ఉన్నారు. వారి ఆదేశాలు ఉన్నాయో, ఏమో గానీ..వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లకు పల్లెల్లో జరిగే అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఆహ్వానం అందడం లేదు. ప్రభుత్వపరంగా చేపట్టిన ఏ కార్యక్రమానికీ వారిని పిలవడం లేదు. అధికారపరంగా నిర్వహించే సమావేశాలకూ ఆహ్వానం అందడం లేదు. సాలూరు నియోజకవర్గంలో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. పాచిపెంట మండలం కేసలి పంచాయతీ కుమ్మరివలసలో సుమారు 20 రోజుల క్రితం బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కనీసం ప్రథమ పౌరుడిగా సర్పంచ్‌ను పిలవకుండానే ఆ కార్యక్రమాన్ని నిర్వహించేశారు. ఇదే నియోజకవర్గం కర్రివలస, కోనవలస, పద్మాపురం, కేరంగి, గురునాయుడుపేట, పణుకువలస, మూటకూడు, తామరపల్లి, గరిసిగుడ్డి, సతాభి, రాయిగుడ్డివలస, గుమిడిగూడ పంచాయతీల్లోనూ ఇటువంటి పరిస్థితులే ఉన్నాయి.

విధులకు భంగం కలిగిస్తూ..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల మంజూరుకు సంబంధించి పంచాయతీ తీర్మానం చేయాలి. పనులు అమలు చేయడం సర్పంచ్‌ల బాధ్యత. చేసిన పనులకు బిల్లుల చెల్లింపు గ్రామ పంచాయతీ ఖాతాల ద్వారా జరగాలి. వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు ఉన్న చోట్ల ఇది అమలు కావడం లేదు. కూటమి నాయకుల అనుమతులు ఉంటే చాలన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇదే విషయమై ఇటీవల పలు పంచాయతీల సర్పంచ్‌లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు కూడా చేశారు. గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశాలకు విధిగా హాజరు కావాల్సిన అధికారులు డుమ్మా కొడుతున్నారు. మొక్కుబడిగా ఒకరో, ఇద్దరో హాజరవుతున్నారు. కొంతమంది అధికారులు పనులు ముందుగా చేపట్టి, తమకు కావాల్సిన విధంగా పంచాయతీ తీర్మానం ఇవ్వాలని సర్పంచ్‌ల మీద ఒత్తిడి చేస్తున్నారు. మరికొన్ని చోట్ల సర్పంచ్‌ల సమ్మతి, అనుమతి లేకుండానే తీర్మానాలు చేసేసి..నివేదిక తయారు చేసి, సంతకాలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నట్లు పంచాయతీ ప్రథమపౌరులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పింఛన్ల పంపిణీ, అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల విషయంలో సర్పంచ్‌లకు కనీస సమాచారం ఇవ్వడం లేదని వాపోతున్నారు. సర్పంచ్‌లకు అధికారులు కనీస గౌరవ, మర్యాదలు ఇచ్చేలా చూడాలని..ఆ పదవి పవిత్రతను కాపాడాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వారంతా విజ్ఞప్తి చేయడం గమనార్హం.

కూటమిలో లుకలుకలు

- బయటడిన విభేదాలు
- ఎమ్మెల్యేను నిలదీసిన బీజేపీ నాయకులు



ప్రజాదర్బార్ సమావేశంలో ఎమ్మెల్యే జగదీశ్వరిని నిలదీస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ నాయుడు

కొమరాడ: మండలంలోని కూనేరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో కూటమి నాయకుల మధ్య అంతర్గత విభేదాలు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సమక్షంలో భగ్గుమన్నాయి. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్.నాయుడి విషయంలో ప్రొటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్యేపై ఆ పార్టీ నాయకులు విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో ప్రజా సమస్యలు పక్కన పెట్టి కూటమి నాయకులు వాదులాడుకోవడంతో బయల్పడిన అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ప్రభుత్వంలో తాము కూడా భాగమైనా కానీ కురుపాం నియోజవర్గంలో ఎందుకు తమను పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేను వారు నిలదీశారు. అన్నీ మీరే చేసుకుంటూ పోతే మీపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కేజీబీవీల్లో బోధనేతర సిబ్బందికి దరఖాస్తుల ఆహ్వానం



డీఈఓ జి.పగడాలమ్మ

పార్వతీపురంటౌన్: కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ జి.పగడాలమ్మ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె డీఈఓ కార్యాయంలో మాట్లాడుతూ సమగ్ర శిక్షా ద్వారా పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టులను పొరుగుసేవల (ఔట్ సోర్సింగ్) ప్రాతిపదికన 2024–25 విద్యా సంవత్సర కాలానికి భర్తీ చేసేందుకు అర్హులైన, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామన్నారు.

ఖాళీల వివరాలు:

టైప్3 కేజీబీవీలలో హెడ్ కుక్	2
టైప్3 కేజీబీవీలలో అసిస్టెంట్ కుక్	9
టైప్3 కేజీబీవీలలో డే/నైట్ వాచ్ ఉమెన్	2
టైప్4 కేజీబీవీలలో హెడ్‌కుక్	3
టైప్4 కేజీబీవీలలో అసిస్టెంట్ కుక్	4
టైప్4 కేజీబీవీలలో చౌకీదార్	3

ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు ఈనెల 15వ తేదీ వరకు సంబంధిత మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. వయోపరిమితి తేదీ 1 జూలై 2024కు ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 18–42 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ఈడబ్ల్యూఎస్‌కు 47 సంవత్సరాలు, దివ్యాంగులకు 52 సంవత్సరాలు, మాజీ సైనిక ఉద్యోగినులకు 45 సంవత్సరాలు, వయోపరిమితి సడలింపు ఉందన్నారు. నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి సమాచారానికి సంబంధిత మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయలంలో సంప్రదించాలని సూచించారు.

లష్కర్ల సమస్యలు పరిష్కరించండి



జలవనరుల శాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వర్క్‌చార్జ్‌డ్ ఉద్యోగులు

- జలవనరుల శాఖ మంత్రి రామానాయుడుకు విజ్ఞప్తిచేసిన వర్క్‌చార్జ్‌డ్ ఉద్యోగులు

వీరఘట్టం: సాగునీటి కాలువల నుంచి పంటల పొలాలకు సాఫీగా సాగునీరు సరఫరా చేసేందుకు పాటుపడుతున్న లష్కర్ల సమస్యలను పరిష్కరించాలని జిల్లాకు చెందిన వర్క్ చార్జ్‌డ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని విజయవాడలో కలిసి తమ సమస్యలను వివరించారు. ముఖ్యంగా లష్కర్ల కొరత ఉందని, కొత్త నియామకాలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో వర్క్ చార్జ్‌డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కలందర్, ప్రధాన కార్యదర్శి వి.గౌరునాయుడు, డి.జి.ప్రసాదరావు, మురళీమోహన్, తదితరులు ఉన్నారు.

వేధింపులు.. అవమానాలు!

- టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలు
- రాజకీయ ముద్రవేసి ఎక్కడికెక్కడికో బదిలీలు
- న్యాయం కోసం రోడ్డెక్కినా కానరాని సానుకూల స్పందన
- ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తే బాసటగా నిలుస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: టీడీపీ కూటమి ప్రభుత్వం నాలుగు నెలల పరిపాలన కాలంలోనే ఉద్యోగులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు చెప్పిన మాటలన్నీ నీటిమూటలయ్యాయి. సరికదా వారిపై కక్ష సాధింపులు ఎక్కువయ్యాయి. దీనికి పరాకాష్టగా విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ ఉద్యోగులకు దుర్భాషలు, వ్యక్తిగత దూషణలు నిత్యకృత్యమయ్యాయి. విధిలేని పరిస్థితుల్లో న్యాయం కోసం రోడ్డెక్కారు. ఇలా ఇబ్బందులకు గురవుతున్న ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ తరఫున బాసటగా నిలుస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అభయమిచ్చారు. విజయనగరం మున్సిపల్ కమిషనర్ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. మంగళవారం తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు పరిపాలనను పూర్తిగా గాలికి వదిలేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన పరిపాలన సంస్కరణలను, అమలుచేసిన సంక్షేమ పథకాలను ఏవిధంగా నిర్వీర్యం చేస్తున్నదీ, అందుకు తెరవెనుక కారణాలేమిటో ఒక్కొక్కటీ బయటపడుతున్నాయి.

ఆదర్శవంతమైన వ్యవస్థల నిర్వీర్యం...

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేయడమే లక్ష్యంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన గ్రామ/వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను తీసుకొచ్చారు. వీటిలో కీలకమైన సచివాలయ వ్యవస్థలో సుమారు లక్షా 30 వేల మంది యువతకు శాశ్వత ప్రాదిపదికన ఉద్యోగాలు కల్పించారు. రాష్ట్ర చరిత్రలో ఎక్కడా అవినీతికి, అక్రమాలకు ఆస్కారం లేకుండా ప్రతిభ ఒక్కటే కొలమానంగా అన్ని ఉద్యోగాలు కల్పించడం ఒక రికార్డు. అంతేకాదు గత ఐదేళ్లలో ప్రజల నుంచి వచ్చిన వివిధ రకాల 11.48 కోట్ల వినతులను పరిష్కరించిన ఘనత కూడా ఈ సచివాలయ వ్యవస్థకు చెందుతుంది. అందుకే అనేక రాష్ట్రాలు మోడల్‌గా తీసుకొన్న వ్యవస్థ ఇది. వీరికితోడు 2.60 లక్షల మంది వలంటీర్లతో కూడిన వ్యవస్థ కరోనా కష్ట సమయంలో సైతం ఏవిధంగా సేవలందించిందో ప్రజలందరికీ అవగతమైన విషయమే.

వలంటీర్లకు వెన్నుపోటు...

సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు వలంటీర్లకు అనేక హామీలిచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వస్తే గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని స్వయంగా చెప్పారు. ఆ పెంపు మాటే మోగానీ వ్యవస్థనే సమూలంగా ఎత్తివేసే పరిస్థితి తెచ్చారు. అన్ని ప్రభుత్వ సేవల నుంచి తప్పించి వలంటీర్లకు వెన్నుపోటు పొడిచారు.

సచివాలయ ఉద్యోగులకు వేధింపులు

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల ఉద్యోగులు రోడ్డెక్కాల్సిన పరిస్థితులు వచ్చాయి. జాబ్‌చార్ట్‌ను పక్కనబెట్టి ఒక సమయపాలన లేకుండా పనులు చెబుతూ కమిషనర్ ఏరకంగా వేధింపులకు గురిచేస్తున్నదీ వెలుగులోకి వచ్చింది. దుర్భాషలాడటం, థర్డ్ గ్రేడ్ సిటిజన్‌లా చూడటం, వ్యక్తిగత దూషణలతో అవమానించడంపై తమ గోడు వెళ్లబోసుకునేందుకు జిల్లా కలెక్టరేట్‌కే వెళ్లారు. తర్వాత మంత్రినీ కలిశారు. అక్కడెక్కడా సానుకూలమైన స్పందన లభించలేదు. చివరకు స్థానిక విజయనగరం ఎమ్మెల్యేను కలిసేందుకు రాత్రి 9 గంటల సమయంలో వెళ్తే ఆమె అందుబాటులోనే లేరు. మహిళా ఉద్యోగులు సైతం బంగ్లా గేటు వద్దే ఎదురుచూసి చివరకు అక్కడ పనివారికి వినతిపత్రం ఇవ్వాల్సి వచ్చిందంటే... ఇలాగేనా ప్రజలకు అందుబాటులో ఉండేది? ఏ ఆపద వచ్చినా అన్నివేళాలా అందుబాటులో ఉంటామని ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు ఏమయ్యాయి? వలంటీర్లను తప్పించినట్లే సచివాలయ ఉద్యోగులనూ భయభ్రాంతులకు గురిచేసి పారిపోయేట్లు చేయడమే లక్ష్యంగా పరిపాలన ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ద్వారా ప్రతి నెలా తొలి ఐదు రోజులూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో వలంటీర్లను తప్పించేసి ఒక్కరోజులోనే మొత్తం పింఛన్లు అన్నీ పంపిణీ చేసేయాలని సచివాలయ ఉద్యోగులను వేధిస్తున్నారు. మహిళా ఉద్యోగులు సైతం తెల్లవారుజామున 4:30 గంటలకల్లా లాగిన్ కాకపోతే షోకాజ్ నోటీసులు పంపిస్తున్నారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఉద్యోగులకు బాసటగా ఉంటాం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పరిపాలన ప్రజలకు చేరువ చేయడంలో ఉద్యోగులు కీలకంగా వ్యవహరించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక గత నాలుగు నెలల్లో వారిపై కక్ష సాధింపు చర్యలు, వేధింపులు తప్ప సానుకూలమైన నిర్ణయాలేవీ కనిపించట్లేదు. ఇటీవల నిర్వహించిన బదిలీలే ఓ నిదర్శనం. మహిళా ఉద్యోగులను సైతం జిల్లాలు దాటించి పోస్టింగ్‌లు ఇచ్చారు. తమ పార్టీ మద్దతుదారులుకాదంటూ ఎంతోమందిపై రాజకీయ ముద్ర వేసి వేధింపులకు గురి చేస్తున్నారు. ఇది మంచి విధానం కాదు. ఉద్యోగులు ముఖ్యంగా సచివాలయ ఉద్యోగుల పట్ల విజయనగరం కమిషనర్ తీరు మార్చుకోవాలని హెచ్చరిస్తున్నాం. ఏ ఉద్యోగులను ఇబ్బందిపెట్టినా వారికి కచ్చితంగా వైఎస్సార్‌సీపీ బాసటగా ఉంటుంది.

క్లుప్తంగా

నాలుగు ఇసుక లారీలు సీజ్



సీజ్ చేసిన ఇసుక లారీలు

పాలకొండ: మండలంలోని మంగళాపురం సమీపంలో నాగావళి నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలను రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. సోమవారం రాత్రి సమయంలో కొంత మంది ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన సబ్‌కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి తహసీల్దార్ బాలము రళీకృష్ణకు ఆదేశాలు జారీ చేయ దంతో ఆయన సిబ్బందితో వెళ్లి నాలుగు ఇసుక లారీలను గుర్తించారు. ఒక్కొక్కటి 27 టన్నుల ఇసుకతో ఉన్న లారీలను సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు.

ఎనిమిది తులాల బంగారం చోరీ

చీపురుపల్లి: పల్లెటూరిలో పట్టపగలు ఉదయం 8 గంటల సమయంలో అందరూ సంచరిస్తుండగా ఎనిమిది తులాల బంగారం చోరీకి గురైంది. చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి బాధితులు శేషపు కృష్ణ, జయమ్మ అందించిన వివరాల్లోకి వెళ్తే..గ్రామానికి చెందిన శేషపు కృష్ణ, జయమ్మ దంపతులు ఉదయం 8 గంట సమయంలో జొన్నలు ఆడించేందుకు గ్రామ శివారున ఉన్న శివాలయం వద్దకు వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లాక జొన్నలు ఆడించే చేటలు మరిచిపోవడంతో జయమ్మ తిరిగి చేటల కోసం ఇంటికి వచ్చింది. ఆమె ఇంటికి చేరుకునే సమయానికి ఇంటి తలుపులు తెరిచి ఇంట్లోని వస్తువులు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. అంతేకాకుండా కప్‌బోర్డు కూడా తెరిచి ఉంది. దీంతో విస్మయానికి గురైన జయమ్మ కబ్‌బోర్డులో వస్తువులను పరిశీలించగా అందులో ఉండాల్సిన మూడున్నర తులాల పుస్తెల తాడు, మూడున్నర తులాల గొలుసులు, అరతులం చొప్పున రెండు ఉంగరాలు మొత్తం ఎనిమిది తులాల విలువైన బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో లబోదిబోమంటూ ఆ దంపతులు పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం మేరకు పోలీసులు, క్లూస్ టీమ్‌తో గ్రామానికి వచ్చి పరిశీలించి ఆధారాలు సేకరించారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

- మరో నలుగురికి గాయాలు



వానపల్లి సాగర్ మృతదేహం

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై చినభోగిలి–కాశీపేట గ్రామాల మధ్య మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్ వెంకంపేట గ్రామానికి చెందిన వానపల్లి సాగర్(20), జె శివవరప్రసాద్, జి పారన్నాయుడులు మోటార్ సైకిల్‌పై సీతానగరం నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. అదే సమయంలో పాచిపెంటమండలం రొడ్డవలస గ్రామానికి చెందిన వై.బాలయ్య, పి.పోతయ్య టీవీఎస్ వాహనంపై బొబ్బిలి నుంచి సీతానగరం వైపు వస్తున్నారు. ఆ రెండువాహనాలు కాశీపేట–చినభోగిలి గ్రామాల మధ్య ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయాపాలైన ఐదుగురిని పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా వానపల్లి సాగర్ మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు వైద్యాధికారులు ధ్రువీకరించారు. మిగతా నలుగురు చికిత్స పొందుతున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు.

కారు, ఆటో ఢీ: ఆరుగురికి గాయాలు



సంఘటన స్థలంలో ఆటో, కారు

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.బూర్జవలస పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం సాయంత్రం కారు, ఆటో ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఆరుగురు గాయాలపాలైనట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. రామభద్రపురం నుంచి పెదమానాపురం వస్తున్న కారు మరడాం నుంచి కె.కృష్ణాపురం వెళ్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటోలో ఉన్న పతివాడ కృష్ణమ్మ, చిప్పాడ లక్ష్మి, సుమల సత్యవతి, సావు వరాలమ్మ, కళింగపట్నం బంగారమ్మ, జితేంద్ర తదితరులకు గాయాలయ్యాయి. దీంతో వారిని వెంటనే గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించి వివరాలు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విజయనగర ఖ్యాతి ఇనుమడించేలా ఉత్సవాలు

- క్రీడానైపుణ్యాన్ని పెంచేందుకు కృషి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజ్జి స్టేడియంలో క్రీడోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం: జిల్లా ఖ్యాతి ఇనుమడించేలా విజయనగర ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మన వైభవాన్ని దశదిశలా చాటేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి మంత్రి శ్రీనివాస్ ఉత్సవ వేదికలను మంగళవారం పరిశీలించారు. ముందుగా విజ్జీ స్టేడియాన్ని సందర్శించారు. నూతనంగా నిర్మితమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి, ప్రారంభానికి సిద్ధం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. విద్యుత్ సదుపాయం కోసం 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని చెప్పారు. స్కేటింగ్ ట్రాక్‌ను, వాలీబాల్ కోర్టును, పోటీలు నిర్వహించే క్రీడామైదానాన్ని, క్రికెట్ స్టేడియాన్ని ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు. ఫ్లడ్‌లైట్లు, నెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేడియంలో భద్రతా ఏర్పాట్లు చేయాలని, స్టేడియం నుంచి స్కేటింగ్ ట్రాక్‌కు మెట్లు నిర్మించాలని చెప్పారు.


లేజర్ షో ద్వారా చరిత్ర

కోట వెనుకభాగంలో జరుగుతున్న సుందరీకరణ పనులను మంత్రి పరిశీలించారు. అక్కడ లేజర్‌షో ద్వారా విజయనగరం చరిత్రను వివరించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆ ప్రాంతాన్ని అందంగా, అహ్లాదకరంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. అనంతరం మాన్సాస్ గ్రౌండ్‌లోని సరస్ డ్వాక్రా ఎగ్జిబిషన్ ఏర్పాట్లను పరిశీలించారు. పుష్పప్రదర్శన స్టాల్, సాంస్కృతిక కార్యక్రమాల వేదికలను సందర్శించారు. ఈనెల 10వ తేదీన ప్రారంభం కానున్న అఖిలభారత డ్వాక్రా బజార్ (సరస్) పోస్టర్లను, పాంప్లేట్లను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు.

ఖ్యాతి ఇనుమడించేలా:

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్తరాంధ్రస్థాయి క్రీడాపోటీలను విజ్జీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పర్యటనలో మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఏపీడీ సావిత్రి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు ఐవీపీరాజు, ఇతర అధికారులు, కోచ్‌లు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత



సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు సత్కారం

విజయనగరం: అమ్మ వంటి మాతృ భాషను గౌరవించుకోవాలని, తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలో ఆయన పర్యటిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికైన రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఏకైక కవి సుద్దాల అశోక్ తేజను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం పరిపాలన అధికారి డాక్టర్ ఎస్‌వీఎస్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

జూనియర్ అథ్లెటిక్స్ విజేతలను అభినందించిన జేసీ



క్రీడాకారులను అభినందిస్తున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం: ఈనెల 4,5,6 తేదీల్లో రాజమండ్రిలోని ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి 37 వ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మొత్తం 20 పతకాలను సాధించి తమ సత్తా చాటారు. ఈ పోటీల్లో 11 స్వర్ణ, 6 రజిత, 3 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆ విజేతలను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మంగళవారం తన చాంబర్‌లో అభినందించారు. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తామని జేసీ ఈ సందర్భంగా అన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన 7 గురు క్రీడాకారులకు అన్ని విధాలా సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు రామతీర్థంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహం

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం జరగనుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలనంతరం సాయంత్రం 4 గంటలకు స్వామి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించనున్నామని అర్చకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 12న పూర్ణాహుతి, అవబృదం, చక్రస్నానం, జమ్మివేట, ధ్వజావరోహణ కార్యక్రమాలు కొనసాగుతాయని, 13న శ్రీ వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం జరిపించి బ్రహ్మోత్సవాలను పూర్తి చేయనున్నట్లు చెప్పారు.

డీఎస్సీ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీలో శిక్షణ ఇవ్వడానికి సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.డి గయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన శిక్షణ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు శిక్షణను సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్స్‌లో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపేనల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు శిక్షణ ఇచ్చి ఉండాలనే నిబంధనలు విధించినట్లు పేర్కొన్నారు. డీఎస్సీ శిక్షణ సంస్థలను జాబితాలోకి చేరడానికి పూర్తి వివరాలను ఈ–ప్రొక్యూర్‌మెంట్) పోర్టల్ (హెచ్‌టీటీపీ://టెండర్.ఏపీఈమెంట్.జీఓవీ.ఇన్) లో అప్‌లోడ్ చేశామని తెలిపారు. ఆసక్తి ఉన్న శిక్షణ సంస్థలు ఇతర వివరాలకోసం ఈఓఐ డాక్యుమెంట్‌ను ఏపీ ఈ–ప్రొక్యూర్‌మెంట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు. ఈనెల 21లోగా దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

నల్లమందు పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై వి.ప్రసాదరావు



పట్టుబడిన నల్లమందు

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలస పరిధిలో గల పెట్రోల్ బంకు సమీపంలో రాజస్థాన్ డాబా వద్ద ఎస్సై వి. ప్రసాదరావు సిబ్బందితో కలిసి 7వ తేదీన నల్లమందును పట్టుకున్నారు. గతంలో మండల కేంద్రం పరిసర ప్రాంతాల్లో గంజాయి, గుట్కా, ఖైనీ వంటి మాదక ద్రవ్యాలు అక్రమరవాణా చేస్తూ పలువురు నిందితులు పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. కానీ ఇప్పుడు నల్లమందు కూడా సరఫరా చేస్తూ పట్టుబడడం ఆందోళనకు గురిచేస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రంలోని బర్మార్ జిల్లా మండలి మండలం,కోర్నా గ్రామానికి చెందిన రాజేష్ చౌదరి అలియాస్ రాజేష్ ముచ్చర్లవలస సమీపంలో రాజస్థాన్ డాబా ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు.అలాగే రాజస్థాన్ నుంచి నల్లమందు తీసుకొచ్చి ఆ డాబాకు వచ్చిన లారీ డ్రైవర్లకు సరఫరా చేస్తున్నాడు. ఈ సమాచారం మేరకు ఎస్సై తన బృందంతో పాటు ఉపతహసీల్దార్ గిరిధర్‌తో కలిసి వెళ్లి నిందితుడిని పట్టుకుని 78 గ్రాముల నల్లమందు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సుమారు 8 నెలలుగా ప్రతి మూడు నెలలకోసారి రాజస్థాన్ వెళ్లి నల్లమందు తీసుకొచ్చి లారీ డ్రైవర్లకు సరఫరా చేస్తున్నాడు. నల్లమందుతో పట్టుబడిన నిందితుడిని అరెస్టు చేసి ఎస్సై వి.ప్రసాదరావు కేసునమోదు చేశారు. సీఐ నారాయణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని సాలూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

రూ.1.20 కోట్లతో పైడితల్లి జాతర ఏర్పాట్లు

- కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య

విజయనగరం: పైడితల్లమ్మ సిరిమాను జాతర మహోత్సవం ఈ నెల 15న జరగనున్న నేపథ్యంలో విజయనగరం నగరపాలక సంస్థ తరపున అన్ని సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికను కల్పిస్తున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య మంగళవారం తెలిపారు. కోటి 20 లక్షల రూపాయలతో బీటీ రోడ్లు, వివిధ రహదారుల మరమ్మతు పనులు, డివైడర్లకు ఉన్న రైలింగులకు రంగులు, వివిధ జంక్షన్లలో విద్యుదీకరణ, అలాగే ప్రాశస్య భవనాలకు విద్యుదీకరణ వంటి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పుత్సల వీధిలో బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశామని తెలిపారు. హుకుంపేటలోని పూజారి ఇంటి నుండి సిరిమాను చదురు గుడి వరకు తరలి వస్తుందని ఇదే సమయంలో సిరిమాను ఆగమనానికి ఎక్కడ ఆటంకం లేకుండా రహదారులను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. నగరంలో జాతర జరిగే రెండు రోజులు నిరాటంకంగా మంచినీటి సరఫరా చేస్తామని తెలిపారు. కుళాయిలు లేని ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా మంచినీటి పంపిణీ జరుపుతామన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలలో వీధిలైట్లు పునరుద్ధరించామని అన్ని వీధి లైట్లు వెలిగే విధంగా చూస్తామని చెప్పారు. పారిశుద్ధ్య పరంగా ప్రత్యేక పని వారలను నియమించినట్లు చెప్పారు. 430 మంది అదనపు పారిశుద్ధ్య కార్మికులను సిరిమాను సందర్భంగా నియమించామన్నారు. ప్రతి వీధిలో కాలువల పూడికతీత పనులను చేపట్టామని తెలిపారు. అమ్మవారి చల్లదనాలు చేపడుతున్న ప్రాంతాలలో పారిశుద్ధ్య పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా చైతన్యవంతులై రహదారులను, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారాలను వేయరాదని కోరారు. ప్రసాదాల పంపిణీ సమయంలో కచ్చితంగా పేపర్ ప్లేట్లుగాని, విస్తరాకుల ప్లేట్లుగాని వినియోగించాలని సూచించారు. ఎక్కడా ప్లాస్టిక్ వినియోగానికి తావు లేదని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే అవగాహన కల్పించామని అయినప్పటికీ ప్లాస్టిక్ వినియోగాన్ని జరిపినట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలో గోడ రాతలు ఉండరాదని తెలిపారు. అనుమతి లేనిదే పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదన్నారు. అందరి సహకారంతో పైడితల్లమ్మ జాతరను ఆనందోత్సాహాలు నడుమ నిర్వహించుకుందామని తెలిపారు.

పైడితల్లి జాతర ఏర్పాట్లపై సూచనలివ్వండి : ఎంపీ

విజయనగరం: ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించే విజయనగరం ప్రజల ఇలవేల్పు పైడితల్లమ్మవారి జాతర ఏర్పాట్లుకు సంబంధించి భక్తులు తమ సూచనలు, సలహాలు అందజేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. సలహాలు ఇవ్వదలిచిన భక్తులు 94404 36426, 89190 60911, 98499 06486 నంబర్లకు డయల్ చేసి తమ అమూల్యమైన సలహాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, జిల్లా రెవెన్యూ అధికారి, దేవదాయ శాఖ అధికారులతో పాటు ఇతర అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. సిరిమాను ఊరేగింపు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు సౌకర్యాల కల్పన, భద్రతా సౌకర్యాలు తదితర అంశాలపై సలహాలు అందించవచ్చని సూచించారు.

జీఎంఆర్ కేర్‌లో అరుదైన శస్త్రచికిత్స

- రోగి ప్రాణాలు కాపాడిన వైద్యులు



ఆపరేషన్ అనంతరం పేషెంట్‌తో వైద్యులు

రాజాం: స్థానిక జీఎంఆర్ కేర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను వైద్యులు నిర్వహించి ఓ రోగి ప్రాణాలు కాపాడారు. ఈ మేరకు ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి ఎం.డి డాక్టర్ దామెర రాజేంద్ర వివరాలు వెల్లడించారు. రాజాం పట్టణంలోని వస్త్రపురికాలనీకి చెందిన నల్ల సత్యవతి అనే వృద్ధురాలికి వారం రోజుల క్రితం ఒక చెయ్యి, ఒక కాలు పనిచేయకపోవడంతో ఆస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్చారు. ఎమర్జెన్సీ వార్డులో అత్యవసర చికిత్స అనంతరం స్కానింగ్ చేయగా ఆమెకు మెదడులో రక్తస్రావం జరుగుతున్నట్లు గమనించారు. ఈ సమయంలో ఆమెకు అత్యవసర ఆపరేషన్ అవసరం ఉందని న్యూరో సర్జన్ డాక్టర్ వినోద్ గుర్తించారు. దీంతో ఈ విషయం కుటుంబసభ్యులకు వివరించి, వారు అంగీకరించిన తరువాత ఎవేక్ క్రానియోటమీ(మెలకువలో ఉండగానే మెదడుకు చికిత్స) చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 4న ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు వినియోగించి ఎవేక్ క్రానియోటమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. తమ కుటుంబ పెద్ద ప్రాణాలు కాపాడిన కేర్ ఆస్పత్రి వైద్యులను సత్యవతి కుటుంబసభ్యులు అభినందించారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి



ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తున్న బుడితి అప్పలనాయుడు తదితరులు

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు

విజయనగరం ఫూల్‌బాగ్: పాలకులు మారుతున్న ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్రలో ప్రాంతీయ సదస్సు, రాయలసీమలో ఒక చోట, కోస్తాంధ్రలో మరోచోట జరపాలని రాష్ట్ర సమితి నిర్ణయం మేరకు అక్టోబర్ 22 వ తేదీన ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సులో భవిష్యత్తు కార్యాచరణ కూడా రూపొందించుకోనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక అమర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం ప్రాంతీయ సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, రైతు సంఘం నాయకుడు, పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



చదురుగుడి అమ్మవారు



వనంగుడిలో కొలువైన పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలం కరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ అమ్మవారికి వేకువ జామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో దర్శించేందుకు తరలివచ్చారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చదురుగుడి ఆలయం పక్కన ఉన్న ఖాళీస్థలాన్ని టెంట్‌లు, కింద మ్యాట్‌లు వేసి క్యూ కాంప్లెక్స్‌గా తయారుచేశారు. క్యూలో ఉన్న భక్తులకు మజ్జిగ, మంచినీటిని, చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు, పాలను అందించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి విశిష్ట కుంకుమార్చన నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడిలో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

భద్రతా ఏర్పాట్లపై డీఐజీ పర్యవేక్షణ

- పైడితల్లి జాతర బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ వకుల్ జిందాల్, ఈఓ ప్రసాదరావు తదితరులు

విజయనగరం క్రైమ్: విజయనగర, ఉత్సవాలు, శ్రీ పైడితల్లి అమ్మవారి తొలేళ్లు, సిరిమానోత్సవం సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఏర్పాటుచేస్తున్న బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా ఎస్పీ వకుల్ జిందాల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఇతర అధికారులతో కలిసి అమ్మవారి ఆలయం, క్యూలు, దేవాలయం వెనుకభాగం, కమాండ్ కంట్రోల్ రూమ్, మూడులాంతర్లు, గురజాడ అప్పారావు రోడ్డు, కోట జంక్షన్ ప్రాంతాలను, గుర్తించిన పాత భవనాలను స్వయంగా క్షేత్రస్థాయిలో సందర్శించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమ్మవారి పండగ, ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో రానున్న నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. సిరిమాను, ఇతర రథాలు తిరిగే మార్గంలో ఎక్కువ సంఖ్యలో భక్తులు రాకుండా ఐరన్ బారికేడింగ్ ఏర్పాటుచేయాలని, ముఖ్య కూడళ్లలో మూడంచెల్లో ఐరన్ బారికేడింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా పోలీసు శాఖ చేపట్టే చర్యలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

2 వేలమంది పోలీసు బందోబస్తు

క్షేత్రస్థాయి పర్యటన అనంతరం పోలీస్ అధికారులతో నిర్వహించిన డీఐజీ జెట్టి నిర్వహించిన సమీక్షలో విజయనగర ఉత్సవాలు, తొలేళ్లు, సిరిమానోత్సవానికి సంబంధించి 2వేల మందితో పోలీసు బందోబస్తు మూడు షిఫ్టులతో వినియోగిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ట్రాఫిక్ రెగ్యులేషన్, వాహనాల మళ్లింపు, పార్కింగ్ స్థలాల వద్ద ప్రత్యేకంగా పోలీస్‌సిబ్బందిని కేటాయిస్తున్నామని తెలిపారు. అమ్మవారి ఆలయం దగ్గరలో తాత్కాలికంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసి, వాటికి 80 సీసీ కెమెరాలను, బాడీవార్న్ కెమెరాలను అనుసంధానం చేసి భద్రతను పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. శిథిలావస్థలో ఉన్న 11 భవనాలు గుర్తించి, ఆయా ఇంటి యజమానులకు నోటీసులు జారీచేసి, వాటిపైకి ఎవరినీ అనుమతించకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. ఏరియల్ నిఘా కోసం మూడు డ్రోన్స్‌ను వినియోగిస్తున్నామన్నారు. ముఖ్య ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేందుకు బీడీ టీమ్‌లను, అత్యవసర సమయాల్లో స్పందించేందుకు ప్రత్యేకంగా క్యూఆర్ టీమ్స్‌ను ఏర్పాటుచేశామని తెలిపారు.

డీలర్లను రేషనలైజేషన్ చేయాలి

- జేసీకి ఏపీ డీలర్స్ వెల్ఫేర్ సొసైటీ వినతి



జేసీ సేతు మాధవ్‌కు సమస్యలు చెప్పుకుంటున్న సంఘం ప్రతినిధులు

విజయనగరం అర్బన్: జిల్లాలో చేపడుతున్న రేషన్ డిపోల బై ఫర్‌కేషన్‌లో డీలర్లకు అన్యాయం జరగకుండా రేషనలైజేషన్ చేయాలని ఏపీ ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు మంగళవారం సంఘం ప్రతినిధులు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జీవో నంబర్ 35ను అనుసరించి ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 10 ప్రకారం జరుగుతున్న ఈ ప్రక్రియ కంటే ముందు రేషనలైజ్ చేసి డీలర్ల వయబిలిటీకి తగిన విధంగా కార్డులను కేటాయించాలని కోరారు. జిల్లాలోని కార్పొరేషన్ మున్సిపాలిటీ రూరల్ గ్రామాల్లో చాలా రేషన్ దుకాణాలకు కనీస కార్డులు లేని పరిస్థితులు ఉన్నాయని చెప్పుకున్నారు. అలాంటి రేషన్ దుకాణాలకు తగిన సంఖ్యలో కార్డులు కేటాయించే విధంగా రేషనలైజేషన్ చేయాలని కోరారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఆయా ప్రాంతాల్లో ఉన్న రేషన్ దుకాణాల్లో సచివాలయ వారీగా కార్డులను ఫిజికల్‌గా ఎన్యూమరేషన్ చేసి సింగిల్ మెంబర్ కార్డు (చనిపోయిన వారిని), మైగ్రేషన్ అయిన కార్డులను మ్యాపింగ్ జాబితా నుంచి తొలగించాకే రేషన్ షాపుల పునర్ మ్యాపింగ్ చేయాలని కోరారు. నిబంధన ప్రకారం కార్డులు అన్ని దుకాణాలకు కేటాయించే విధంగా రేషన్‌లైజేషన్ చేసి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జేసీని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు ఎస్.రామారావు తొందరలు ఉన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240